# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-03-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ స్థలాల్లో రాజకీయ ప్రకటనలను ఈ మధ్యాహ్నం 3 గంటల లోపు తొలగించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు.**

2. **ఈ సాయంత్రం పల్నాడు జిల్లాలో టీడీపీ, జేఎస్పీ, బీజేపీ సంయుక్త ఎన్నికల ప్రచార సభలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొంటారు.**

3. **రాష్ట్రంలో రేపటి నుంచీ నెలాఖరు వరకూ పదో తరగతి పరీక్షలు జరుగుతాయి.**

4. **చైనాను ఆర్థికంగా ఎదుర్కోడానికి దేశీయ ఉత్పాదక రంగాన్ని అభివృద్ధి చేయాలని విదేశాంగ మంత్రి జయశంకర్ అన్నారు.**

5. **ఇవాళ సాయంత్రం జరిగే వుమెన్స్ ప్రీమియర్ లీగ్ సీజన్ టూ ఫైనల్ మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్లు తలపడతాయి.**

==========================

ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చినందున ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ స్థలాల్లో రాజకీయ ప్రకటనలతో ఉన్న హోర్డింగ్స్, పోస్టర్లు, కటౌట్లను నేటి మధ్యాహ్నం 3 గంటలలోపు తొలగించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా... జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలుచేయడం గురించి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో ఆయన రాష్ట్ర సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించడం, ఎలక్ట్రానిక్ సీజర్ మేనేజ్మెంట్ సిస్టం వినియోగం, సి-విజిల్ యాప్ ద్వారా అందే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించడం తదితర అంశాలను ఆయన సమీక్షించారు.

------------------------

ఎన్నికల ప్రచారంలో రాజకీయ పక్షాల నాయకులు తమ ప్రసంగాలలో మతపరంగా రెచ్చగొట్టడం వంటి చర్యలకు పాల్పడకూడదని ప్రకాశం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎ.ఎస్ దినేష్ కుమార్ తెలిపారు. ప్రార్థనా స్థలాలను ఎన్నికల ప్రచారానికి వాడుకోరాదని తెలిపారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో భాగంగా చెక్ పోస్టులు, ఫ్లయింగ్ స్కాడ్ లు, ఎంసీఎంపీ బృందాలను నియమించడం జరిగిందన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎన్నికల నేపథ్యంలో కలెక్టర్

కార్యాలయంలో టోల్ ఫ్రీ ఫిర్యాదుల కేంద్రాన్ని ఏర్పాటు చేసామని, ప్రజలు ఎన్నికలకు సంబంధించిన ఎటువంటి ఫిర్యాదులనైనా చేయవచ్చని తెలిపారు.

---------------------------

2024 సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లాలో ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ కె. మాధవీలత వెల్లడించారు. జిల్లా, డివిజన్, మండల, గ్రామ, సచివాలయ స్థాయిలలో స్పందన కార్యక్రమాలను రద్దు చెసామని చెప్పారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున, ఎన్నికల ప్రక్రియ పూర్తయే వరకూ ప్రతీ సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమం ఉండబోదని అనకాపల్లి జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి తెలిపారు. అందువల్ల ప్రజలు దరఖాస్తులు, ఫిర్యాదులతో కలెక్టర్ కార్యాలయానికి రావద్దని కోరారు. మరోవైపు... బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం పిచికల గుడిపాడు గ్రామ పరిధిలోని 16వ నెంబర్ జాతీయ రహదారి పై ఎయిర్ క్రాఫ్ట్ ల్యాండింగ్ ట్రయల్ రన్ ను ఈనెల 18 సోమవారం నిర్వహించనున్న నేపథ్యంలో బాపట్ల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించవలసిన "స్పందన" కార్యక్రమం తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా SP వకుళ్ జిందాల్ తెలియజేసారు.

---------------------------

సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పట్టణంలో కేంద్ర బలగాలు శనివారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాయి. పట్టణంలోని గునుపూడి గుడి నుండి ప్రకాశం చౌక్ సెంటర్ వరకూ కవాతు నిర్వహించాయి. ఆ సందర్భంగా భీమవరం డీఎస్పీ వి. నారాయణస్వామి రెడ్డి మాట్లాడుతూ... సార్వత్రిక ఎన్నికలు శాంతియుతంగా జరిగేందుకు, ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేందుకు వీలుగా ప్రశాంత వాతావరణం కల్పించడమే కవాతు ఉద్దేశ్యమని తెలిపారు.

---------------------------

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్ళాలని రాష్ట్ర విద్యుత్, అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గంలోని ఐరాలలో మంత్రి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.... నాలుగు సంవత్సరాల 11నెలల పాలనలో పేద, బడుగు, బలహీనవర్గాలను తమ ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుందని చెప్పారు.

---------------------------

బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమిలో తెలుగుదేశం-జనసేన చేరిన తర్వాత మొదటిసారి మూడు పార్టీల సంయుక్త బహిరంగ సభ ప్రజాగళం పేరిట ఇవాళ సాయంకాలం జరగనుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, తెలుగుదేశం పార్టీ అధినేత ఎన్. చంద్రబాబునాయుడు, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఈ బహిరంగ సభలో పాల్గొంటారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి వద్ద ఈ సభ నిర్వహిస్తున్నారు. మూడు పార్టీల మధ్యా పొత్తు కుదిరిన తర్వాత జరుగుతున్న మొదటి సంయుక్త ఎన్నికల ప్రచార సభకు భారీఎత్తున ఏర్పాట్లు చేసారు. ప్రధానమంత్రి పాల్గొనే ఈ సభకకు కావటంతో దాదాపు నాలుగు వేలమంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సభా ప్రాంగణం జాతీయ రహదారి పక్కనే ఉండటంతో ట్రాఫిక్‌కి ఇబ్బంది కలుగకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకున్నారు.

---------------------------

రాష్ట్రంలో పదవ తరగతి పరీక్షలు రేపటి నుంచి ప్రారంభం అవుతాయి. ఏడు సబ్జెక్టులకు ఈ నెల 30వ తేదీ వరకూ పరీక్షలు జరుగుతాయి. ఉదయం తొమిదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల 45 నిమిషాల వరకూ పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లూ చేసారు. 7 లక్షల మందికి పైగా విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవుతారు. పరీక్షలు రాసే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేసే వెసులుబాటు కల్పించారు. ఈ నెల 31వ తేదీ నుంచీ పరీక్షాపత్రాలు దిద్దే స్పాట్ వాల్యుయేషన్ మొదలవుతుంది.

---------------------------

చైనాకు అడ్డుకట్ట వేయడానికి దేశీయ ఉత్పాదక రంగాన్ని అభివృద్ధి చేయడం మీద దృష్టి సారించాలని విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జయశంకర్ అన్నారు. చైనాతో మనదేశానికి సరిహద్దుల సమస్య మాత్రమే లేదని, ఆర్థికంగా కూడా ఆ దేశాన్ని ఎదుర్కోవాలనీ ఆయన వివరించారు. భారత్ గత దశాబ్దకాలంలో దేశీయ ఉత్పాదక రంగాన్ని బాగా అభివృద్ధి చేయడం ద్వారా చైనాను ఆర్థికంగా నిలువరించే ప్రయత్నాలు చేస్తోందని మంత్రి తెలిపారు. చైనాతో మిలటరీ స్థాయి చర్చలు నిర్వహించడానికి అనువైన వాతావరణం లేదని జయశంకర్ చెప్పారు. ఇరు దేశాల బలగాలూ సరిహద్దుల వెంబడి మోహరించి ఉన్నాయనీ, అందువల్ల సరిహద్దుల దగ్గర పెట్రోలింగ్ చేపట్టడానికి కొన్ని అడ్డంకులున్నాయనీ వివరించారు.

---------------------------

"ఏ దేశమేగినా ఎందుకాలిడినా.. ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనినా.. పొగడరా నీ తల్లి భూమి భారతిని.. నిలుపరా నీ జాతి నిండు గౌరవము" అంటూ "జన్మభూమి" గీతాన్ని రచించి.. తెలుగు జాతి గౌరవాన్ని ఎలుగెత్తి చాటిన సుప్రసిద్ధ రచయిత, కవి రాయప్రోలు సుబ్బారావు. తెలుగు నవ్య కవితా పితామహుడిగా పేరుగడించిన ఆయన జయంతి ఈ రోజు. 1892 మార్చి 17వ తేదీన గుంటూరు జిల్లా గార్లపాడులో సుబ్బారావు జన్మించారు. మెట్రిక్ వరకు చదివి ఆపై విద్యాభ్యాసం కొనసాగించలేని పరిస్థితుల్లో రాజమండ్రి నుండి వెలువడే 'ఆంధ్రకేసరి' పత్రికలో ఆయన రచనలు చేసేవారు. అనంతర కాలంలో జాతీయోద్యమంపై కవితలు రాశారు. "నాదు జాతి, నాదు దేశము, నాదు భాష అను అహంకార దర్పనమందు" అని ప్రబోధిస్తూ జాత్యభిమానం, దేశాభిమానం, భాషాభిమానం ప్రతి ఒక్కరికీ నరనరాల్లో జీర్ణించుకుపోయేలా ఆయన సృజన చేశారు. తెలుగు భాషను, ఆంధ్రరాష్ట్రాన్ని అమితంగా ప్రేమించి, తన గీతాలతో ఉత్తేజితులను చేశారు రాయప్రోలు సుబ్బారావు.

---------------------------

వుమెన్స్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ రెండో సీజన్ ఫైనల్ మ్యాచ్ ఇవాళ సాయంకాలం ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరగనుంది. ఢిల్లీ క్యాపిటల్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్లు ట్రోఫీ కోసం పోటీ పడుతున్నాయి. పురుషుల ఐపీఎల్ టోర్నమెంట్‌కు దీటుగా జరిగిన డబ్ల్యూపీఎల్ టోర్నమెంట్ రెండో సీజన్... క్రికెట్ అభిమానులను అలరించింది. ఢిల్లీ, బెంగళూరు జట్లు రెండూ చక్కటి ప్రతిభ కనబరిచి ఫైనల్స్‌కు చేరుకోవడంతో ఆఖరి మ్యాచ్‌పై ఆసక్తి నెలకొంది.

---------------------------

రాష్ట్రంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్ర అధికారి డి. శేషసాయి కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ...

వాయిస్ - 20 సెకన్లు

---------------------------

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి చెందిన కలంకారీ కళాకారుడు సుధీర్‌కు అరుదైన గౌరవం దక్కింది. సుధీర్ కలంకారి చిత్రాలను ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో రెండు రోజుల క్రితం ప్రత్యేకంగా ప్రదర్శించారు. ఆ సందర్భంగా కళాకారుడిని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సన్మానించారు. కలంకారీ వృత్తిదారులను కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటోందనీ.. కేంద్రం ప్రభుత్వం ముద్ర యోజన కింద సొంతంగా కలంకారీ పరిశ్రమను ఏర్పాటు చేసుకున్నాననీ సుధీర్ ఆకాశవాణికి తెలిపారు. తన ప్రతిభను ప్రోత్సహించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోడీలకు కృతజ్ఞతలు తెలిపారు.

======================